# స్టవ్

" చూడూ, చూడవోయ్, భద్రం, ఆ చిలకమ్మల్ని చూడు," థియేటర్ కాంటీన్ బయట నించుని గోల్డ్‌ఫ్లేక్ కాలుస్తూ దిక్కులు చూస్తున్న రాజారావు అన్నాడు. వక్కపొట్లాలు కొని, చిల్లర జేబులో వేసుకునితాపీగా వచ్చాడు వీరభద్రం. " చిలకమ్మలా- ఎక్కడ సార్?"

రాజారావు చూపించాడు రిజర్వుడు బుకింగ్ దగ్గర టిక్కెట్లు కొంటూ ఇద్దరు ఆడవాళ్ళు నించుని ఉన్నారు. వాళ్ళు నిజంగా చిలకమ్మలు కాకపోయినా, ఎలికమ్మలు మాత్రం కారు. చూసి చూసి భద్రం అన్నాడు.

" మీ వరస నాకేం నచ్చలేదు, సార్." ... " వరసా? అంటే, నేను చూసిన వరసా, నీకు చెప్పి వరసా?".. " రెండూకాదు మీరు వాళ్లని చిలకమ్మలను చేసిన వరస." రాజారావు ఘొల్లుననవ్వాడు. " ముందు నీ వరస బాగుందోయ్... ఇంతకీ .. నీకు తెలుసా?" ... " తెలియకేమండీ? ఊళ్ళోగర్ల్స్ స్కూలుకి ట్రాన్సురయి వచ్చిన పంతులమ్మలు."

" ఓహ్! అయితే ఇంకేం, మీ చెయిర్మన్ వేటకాడు గురి చూసే ఉంటాడు. చూశావా నా ఎస్టిమేట్ ఎంత ఖచ్చితంగా ఉందో!"

భద్రం చురుక్కున చూశాడు. నిర్లిప్తంగా తల వంచుకుని వక్కపొట్లం విప్పుతూ అన్నాడు.

" పొరబడ్డారు, మాస్టారూ. అవి వేటకాడికి చిక్కని చిలకమ్మలు."..."ఎట్లా?" ..." ఎట్లా అంటే?ఛెయిర్మన్‌నుకలుసుకోగా చూసినట్లు మన సోదరులెవరూ చెప్పుకోలేదు. గనక. వాళ్ల కింత వరకూ ఏ ఇంక్రిమెంటూ శాంక్షన్ అవ్వలేదు గనక, ఏడాదికో ఊరికి ట్రాన్స్ఫరు ఆర్డర్లు నా ద్వారానే వాళ్ళు అందుకుంటున్నారు గనక . ఇంకా చెప్పాలంటే నాకు తెలిసినంతగా మన జడ్.పి.లో ఇంకెవరకీ ఏమీ తెలియదు గనక చాల?"

" ఖరీదయిన సీస పద్యమే చెప్పావోయ్, పంతులూ!" రాజారావు గాలిలోకి రెండు రింగులు ఊదాడు. " కానీ, మనం ఉంది చూశావూ- ఏది.-ఈ భగీరథుడు తలుచుకుంటే కాని కార్యమేదయినా నువ్వు చూశావా?"..." నిజం. తప్పకుండా ప్రయత్నం చెయ్యండి. కాని, ఒక్క మనవి. తమకు సంక్రమించబోయే రెండు బాటా జతల్లోనూ ఆ ఎరుపుది నాకు దానంచేయించండి. కొత్త మోడల్ గా ఉంది, మా చెల్లాయికి ఇచ్చుకుంటాను." ఈ మాటూ నవ్వటం భద్రం వంతు అయింది.

రాజారావు మొహం ఇబ్బందిని పులుము కుంది." నిజమే?"... " రండి, రండి. సెకండు బెల్లయింది." భద్రం రాజరావును చెయ్యి పట్టుకుని హాల్లోకి లాక్కుపోయాడు.

★ ★ ★

ఆదివారం నాడు ఆముదం తాగినట్టున్న మొహంతో వచ్చాడు భద్రం రాజారావు గదికి ఇద్దరూ షికారు బయలుదేరారు. " ఇరవైల్లోనే అరవయిల్లో వాడిలా ఉన్నావు- ఏమిటీ విశేషం?" అడిగాడు రాజారావు.

" అసెంబ్లీ సెషన్సుకని వెళ్ళిన చెయిర్మన్ ఓ నెలరోజుల రాకా రాడుగదా, పనికొచ్చే పని ఏదయినా చేద్దామనుకున్నాను. వారం తిరక్కుండానే వచ్చేశాడు. ఫైల్సుపట్టుకుని రమ్మని కబురొచ్చింది. రాత్రికి వెళ్ళిపోవాలి. వెధవ ఉద్యోగమండి. ఛీ, ఛీ" ... " నిన్నొక్కణ్ణే చూశాను. ఛెయిర్మన్ దగ్గర కాంపుక్లర్కు పోస్టు వెధవదన్నవాడిని. అయినా, నాకు తెలియక అడుగుతాను, బల్లపైన ఓ చెయ్యి, కింద ఓ చెయ్యి, అరెంటికిందా బారచాపిన కాళ్లూ- వెరసి ఈ శాల్తీనంతా సమితి ఆఫీసులో వేసి కూర్చోక, నీకీ వైరాగ్యమేమిటయ్యా! మిస్టర్ భద్రం, లెర్న్‌టు ఎంజాయ్ అండ్ లివ్ ది లైఫ్." ఆగి సిగరెట్టు వెలిగించుకున్నాడు రాజారావు.

భద్రం కొంచెం సేపు ఆలోచనలోమునిగిపోయాడు. తేరుకుని అన్నాడు " ఎన్‌జాయ్‌మెంటా?" ..." అదేనయ్యా, ఆనందం. బాష్యకారుడేమన్నాడు? గురుర్బ్రహ్మ, జ్యోతిర్బ్రహ్మ, నాదం బ్రహ్మ'- అని కదా!ఈ కోవలేదే ఆనందో బ్రహ్మ అంటే మానవుడు ఎప్పటికైనా బ్రహ్మపదార్థాన్ని చేరుకోవలసినవాడే అనీ, ఆ కార్యక్రమానికి ఆధారం ఆనందమనీను! అంటే ఆనందాన్ని అనుభవించటం మనిషికి అవశ్యం గదా! ఇక్కడింకో విషయం నీకు జ్ఞాపకం చెయ్యాలి. ' పెళ్ళి అనేది మంచి పనయితే ఒక మంచి పని ఎన్ని మార్లయినా చెయ్యవచ్చును గనక, పెళ్ళి మీద పెళ్ళి చాలా సార్లు చేసుకో' అన్నాడు గిరీశం చదవలే?"

"చదివాను." ..." మరిహనేం? ఆనందాన్ని అనుభవించటం మంచిపనే గనక అనుభవం మీద అనుభవం, ఆ రెంటి పక్కన మరో అనుభవం, ఈ మూడింటి మీద మరొకటి- ఇలా ఆనందాల పిరమిడ్లు నిర్మించుకుంటూపో. ఆ పిరమిడ్ల ఎత్తు పెరగాలేగాని, ఆ బ్రహ్మం ఏదో నీకు కనబడకపోతుందా? నా మాటవిను. విచారం మాను. ఆదివారం నాటి అద్వైజు ఆరు అభిషేకాల టోకుఫలితాన్ని ఇహంలోను, పరంలోను నీకు ప్రాప్తింపచేస్తుంది.

" ఈగీతోపదేశాలకేం గాని.నీ పెళ్లెప్పుడో చెప్పావు కావు."

భద్రం ఆలోచనల్లోంచి తేరుకున్నాడు. " ఆఁ పెళ్లా? మా మామయ్య కూతురే."

" అదేమిటి, మీ మామయ్యను అమ్మితే అరపైస చెయ్యడన్నావు, పిల్లకేమో పిల్లి కళ్ళన్నావు. ఇదేమి సంబంధమయ్యా!"

" మీ కర్థం కాదులెండి. అయిన వాణ్ణి నేను చేసుకోకపోతే, ఆ పిల్లను కానివాడెవడూ కన్నెత్తి చూడడు. చచ్చిపోయేలోపున ఒక్క మంచి పనైనా చేయాలనీ , దాన్ని స్మరించుకుంటూ చచ్చిపోవాలనీ చేసుకుంటూ ఉంటాను."

"హరి హితుగా! హఠాత్తుగా హండ్రడ్ వెయిట్ బరువు చేసే మాట అన్నావే! సరేకానీ!"

ఇద్దరూ కిళ్లీకొట్టు దగ్గరికి వచ్చారు. కోకాకోలాలు తాగారు. "చిలక్కొట్టులింకా లేవల్లే ఉంది. నువ్వే మివ్వగలవులే వేసిస్తానుండి" అన్నాడు రాజారావు. ఓగోల్డ్‌ఫ్లేక్ వెలిగించాడు. మళ్లీ నడక సాగించారు. రాజారావు అందుకున్నాడు. "పోనీ, ఇదయినా విను. రేపోమాపోపెళ్లవుతుంది. ఆ ఆడకూతుర్ని ఆనంద పరచటానికి కావలసిన అనుభవం అయినా నీకు లేదుగదా! అందుకనే ఇలా చెయ్యి. అమ్మాయిల అపాయింట్‌మెంటు అక్షర్లు తొక్కిపెట్టు లేదా తొక్కిపెట్టించు. నిద్ర చెయ్యందే ముద్రపడదని లోపాయికారిగా అందించు. ఇహ చూడు, ఆ ముద్రకోసం అరుద్ర పురుగులాంటి భద్రకాళి అయినా తన రౌద్రాన్ని వదిలి భద్రంగా నిన్ను చేరి అర్థంగా మంద్రస్వరంతో నాబ్రతుకు భద్రము కావింపుమో వీరభద్రా! అని ఎల్లా అలమటిస్తుందో! మీ స్వామివారి 'నివేదన' తరవాతనే నీ 'అరగింపు' అన్నది మాత్రం మరిచిపోకు, కొంపదీసి తేమలో గట్రా పడేవు సుమా! అల్లాంటి పని జరక్కుండా నీకు నువ్వే

జాగ్రత్త పడుకోవాలి. ఇంతకీ 'ప్రేమ' గురించి ఓ కాళిదాసు ఏమన్నాడో తెలుసా?

ఇట్ ఈజ్ ఎ స్టవ్, ఇట్ బర్న్స్ వైల్ బర్నింగ్‌యు, సో, లస్ట్ ఈజ్ బెస్ట్ ఇట్ లివ్స్ వైల్ ఎన్‌లివెనింగ్ యు ''

రాజారావు ఆపాడు. ఆపి భద్రం ముఖంలోకి చూశాడు పశ్చిమాన అరుణ వర్ణం అలుముకున్నట్లు భద్రం ముఖంలో చిరాకు వ్యాపిస్తుంది. రాజారావు మళ్లీ ఎత్తుకున్నాడు.''చూడవయ్యా! నీ చుట్టూ ఉన్న సృష్టిని చూడు. ప్రతిప్రాణి సుఖం కోసం పాకలాడుతోంది. ఆడేనుగు కోసం మగేనుగు మదం కారుస్తోంది. ఆడనెమలి కోసం మగనెమలి పురి విప్పి డాన్స్ చేసోంది. చిల్లర ప్రానుల్ని మనం రోజూ చూస్తూనే ఉన్నాం గదా? ఇహపోతే తిండి విషయం అంటావా, పెద్ద చేప చిన్నచేపను తింటోంది. పెద్ద మృగం చిన్న మృగాన్ని తింటోంది. అలాంటి ఉదాహరణలు అన్నీ , ఇంక అన్నీ ఆ పైన ఎన్నో! ఇప్పటికయినా తెలివి తెచ్చుకో!''

ఇద్దరూ నడుస్తున్నారు. స్టేటు బస్సుడిపోదాటారు. ఫుడ్ కార్పొరేషను గోడౌన్లు వెనకబడ్డాయి. ఊరు పొలిమేర దాటి చాలా దూరం వచ్చేశారు. రోడ్డు దిగి, చెరుకు తగలబెట్టిన చేలో బూడిద లేని చోటికి చేరారు ఇద్దరూ. భద్రం కూర్చున్నాడు. రాజారావు కూర్చోబోతూ సిల్కులాల్చీలో వెతుక్కున్నాడు. గోల్డ్ ఫ్లేక్ పెట్టెలేదు. మొహంలో ముందర కంగారు, ఆ తరవాతచికాకు తొంగి చూశాయి. '' కిళ్ళీకొట్లో సిగరెట్టు పాకెట్టు తీసుకున్నాను కాదుటోయ్, భద్రం? ఏమైందంటావు?''

భద్రం తన కేమీ తెలియదన్నట్టూ పెదవి విరిచాడు. ''సర్లే, వెళ్లేటప్పుడు ఇంకోటి తీసుకుందాం.' రాజారావుకూడా కూర్చున్నాడు. నడుం వాల్చి మోచేతులమీద ఆన్చి కాలుమీద కాలు వేసుకుని కూర్చున్నాడు. ఉన్నట్టుండి భద్రం అడిగాడు, ''మాస్టారూ మీరు కాలేజీలో చెప్పే ఫిలాసఫీ ఇదేనా?''

రాజారావే అలవోకగా ఒ చిర్నవ్వు విసిరాడు అన్నాడు. '' నాయనా, ఈ ఫిలాసఫీ ఒకళ్ళు చేప్పేది, ఇంకోళ్లు నేర్చుకునేది కాదు. జీవితమే నేర్పుతుంది. అసలు జీవిత మంటే ఏమిటి? అది ఒక ఎల్లిప్స్. అంటే , రెండు కేంద్రాలున్న వృత్తం. కోడిగుడ్డు నీడ ఆకారంలో ఉంటుంది. అన్నట్టు నువ్వు లెక్క వాడివేగా? నీకు చెప్పనక్కరలేదు. మనీ అండ్ మానినీలు రెండూ దాని కేంద్రాలు. ఎవడి జీవిత మయినా ఈ కేంద్రాల చుట్టూ తిరగవలసిందే! అయితే, అందరూ సక్సెస్‌ఫుల్ కాలేరు. అలా కాలేని వాళ్ల జీవితాలు హైపర్‌బోలోలాగా చీలిపోయి అనంతం లోకి దూసుకుపోతాయి, మరి ఇహ ఆ భాగాలు కలవ్వు. ఇంకా కొంత మంది సన్యాసులు ఉంటారు చూడు, వాళ్ల జీవితాలు పెరాబొలాలు, ఒకటే కేంద్రం. అవి కూడా అనంతంలోకి దూసుకుపోయేవే. దుర్భిణికి కూడా అందవు నీలాటి బ్రహ్మజమానాల విషయంలో చెప్పనక్కర్లేదు. అసలు కేంద్రాలే ఉండవు. అన్నీ సరళరేఖలే.''

రాజారావు తన మాటల ప్రవాహాన్ని ఆపి, లాల్చీలో చెయ్యి పెట్టుకోబోయి, '' వెధవది, ఏమయిపోయిందో'' అని చెయ్యి తీసేసుకున్నాడు.

భద్రం మాట్లాడా. ''అయ్యా, గురువుగారూ, తమరన్నట్టు అందరి జీవితాలూ ఎల్లిప్సులు, సెరాబోలాలూ కావండి. కొందరివైనా వంకర్లు లేని పూర్ణ వృత్తాలవుతాయండి, లేదా ఎల్లిప్సులుగా ఉండేవి వృత్తాలుగా మారటానికి కనీసం ప్రయత్నమన్నా చేస్తాయండి ఆ వృత్తాలన్నిటికీ ఒకటే కేంద్రం - ఉత్తమ మానవుడుగా బతకటమనేది. .''

'' చూడు, గురువులూ . '' ..'' నన్నాపకండి ఇందాకట్నుంచీ మీ మాటలు విన్నాను.మీరిప్పుడు నా మాటలు వినండి. మీరిందాకా గిరీశాన్ని కోట్ చేసినప్పుడు ఒక విషయం దాటేశారు అతగాడు చివరి కేమయిపోయాడో చెప్పారు కారు ఆనందం అనేది నాకూ కావాలి. అయితే, గిరీశం లాగా ఒక వెలుగు వెలిగి హఠాత్తుగా అడ్రెసు లేకుండా రాలిపోవటం నాకిష్టం లేదు అలా జీవించే బదులు ఆఫ్రికా

అడవుల్లోకి పోవటం మంచిది. లేదా, ఇప్పుడే ఓ టిన్ను ఎండ్రిన్ పుచ్చుకోవటం ఉత్తమం..''

రాజారావు అడ్డు వచ్చాడు.'' ఇదుగో, జంధ్యాల శాస్త్రీ చూడబోతే నిన్నొక కాన్‌సెన్‌ట్రేషన్ కాంపుకి పంపించి శుద్ధి జరిపిస్తేనే గాని జ్ఞానోదయం అయ్యేట్టులేదయ్యా!''

'' ఆగండి.. ఆఫీసులో నాపై వాళ్లూ కింద వాళ్లూ ఏదో ఏడ్చారని నేనూ ఏడవనక్కర్లేదు. ఆడవాళ్లని అరిడి పెట్టం పంతుళ్లను రాజకీయాల్లో ఇరికించటం వంటి పనులను చేసే చెయిర్మన్, వీటివల్ల కలిగే చికాకులూ మరిచిపోటానికి ఒక్కోరాత్రి ఎన్నెన్ని అడ్డు బిగిస్తుంటాడో మీకు తెలియదు. వాళ్ల ఆకలిని అసరాగా తీసుకుని నాకు లేని ఆకలిని సృష్టించుకొని నేను అనుభవించేది అయినా ఆ అశాంతే కాదా?

''మీరేదో చేపలు, బంతువులు అన్నారు. కానీ, మళ్లీ పప్పులో కాలు వేశారు. ఋతువు అయినప్పుడు ఇది తల్లి, ఇది చెల్లి అనే దాన్ని ఏ జంతువూ పాటించదు. చాలా జంతువులకు ఆకలి అయినప్పుడు 'ఇది నా సంతానం ఇది పర సంతానం' అనే భేదం కూడా తోచదు. ఇంకా చెప్పాలంటే ఒక్కో జంతువుకు ఒక్కోరకమైన ఆహారం మాత్రమే ఉంది. ఏనుగు చేపల్ని తినదు. చేప వెలగపళ్ళు తినదు. తాను గడిపే జీవితం కన్నా ఇంకా ఉన్నతమైన జీవితాన్ని ఎట్లా గడపవచ్చుననే ప్రశ్న ఏ జంతువకూ ఉదయించదు. చాలా జంతువులకు సామూహిక జీవిత వ్యవస్థే కాని ,కుటుంబ వ్యవస్థలో ఉండే మాధుర్యమూ, అప్యాయతలూ అనేవి వాటికి తెలియవు. జీవితంలో ఎదురయ్యే ఆపదలనుండి తమను తాము ఎట్లా రక్షించుకోవాలో మానవుడికి తెలిసినట్లు వాటికి తెలియదు.

'' ఇంకో విషయం మనం గ్రహించాలి. ఇతర ప్రాణులకు తామూ, తమ పరిసరాలూ తప్ప ఇంకేమీ తెలియదు. మనిషికి తనకు మరణం తప్పదని తెలుసు. తానెంత గొప్పవాడైనా, తనకన్నా గొప్ప శక్తి, ఈ క్రిమికీటకాదులను , పశు పక్ష్యాదులను, జంతువులను తనను, చివరికి అనంత విశ్వంలోని గోళాలను కూడా నియమబద్ధంగా నడిపిస్తున్నట్టిది ఒక టుందని తెలుసు. దాన్ని చూసాడు కూడా. అట్లా చూసినవాళ్లు మానవ చరిత్రలో కోకొల్లలు. మానవ సమాజం తన గతిని తప్పి జంతువు లాగానో, లేక జంతువుకన్నా హీనంగానో జీవించటం మొదలు పెట్టినప్పుడు వాళ్లు ఈ సమాజంలోంచే - బురదలోంచి పద్మంలాగా ఉద్భవించి సరిఅయిన మార్గాన్ని చూపిస్తూ వచ్చారు. సరే, ఇది వేరే విషయమనుకోండి. '' ఈ విధంగా మానవుడికీ, జంతువుకీ పోలికే లేదు. మీరు పోల్చిన విధానం చూస్తూఉంటే లోపమంతా మీకు డిగ్రీ ఇచ్చిన యూనివర్సిటీది అనిపిస్తోంది.''

రాజారావు అన్నాడు : '' విచారయోగంలో పడ్డాననీ, సన్న్యాసి నవ్వాలనుందనీ ఒక్క ముక్కలో చెప్పరాదూ, ఇంతెందుకు?'' జేబులో చెయ్యి పెట్టుకోబోయి వెనక్కి తీసుకున్నాడు. ''వెధవది -గొంతు పిండేస్తోంది, నాలిక పీకేస్తోంది. పోదాం పద ''

'' నాకు సన్న్యాసి నవ్వాలని లేదు. చక్కని సంసారినయి సుఖపడాలని ఉంది.'' అంటూ భద్రం నుంచున్నాడు. పాంటు జేబులోంచి గోల్డ్‌ఫ్లేక్ పెట్టె తీసి అన్నాడు '' ఇదుగోనండీ, మీ సిగరెట్లు పెట్టె ఇందాక వస్తున్నప్పుడు మీ జేబులోంచి నేనే తీశాను.''

''హారి సత్కారీ!'' రాజారావు ఆశ్చర్యంతో నోరు తెరిచాడు.

''చూశారా, విలాసవస్తువయిన ఈ సిగరెట్టు పెట్టె లేకపోతే గంట ఒక యుగంగా గడిపారు మీరు. పొట్టకు సంపాదించుకోవటం పెళ్ళి చేసుకుని సుఖంగా సంసారం సాగించటం అనే జీవితావసరాలకై తాపత్రయపడే అతిపిల్లలను అరడి పెడితే శారీరకంగా మానసికంగా వాళ్లకి సంప్రాప్తించే రుగ్మతలవల్ల వాళ్లు తమ జీవితాల్లోని కొన్ని లక్షల గంటలను ఎంత దుర్భరంగా గడపవలసి ఉంటుందో ఊహించారా... అర్థమయిందనుకుంటాను. పదండి, పోదాం ''

భద్రం లేచాడు. రాజారావుకూడా లేచాడు ఇద్దరూ నడక ప్రారంభించారు రాజారావు భద్రం

మొహంలోకి చూశాడు మొదట కళ్ళు చిన్నవి చేసి, ముక్కు రంధ్రాలు పెద్దయ్యేట్లు ముక్కు కుంచించి చూశాడు కొన్ని క్షణాల తరవాత కళ్ళు పెద్దవి చేసి భృకుటిని కుంచించి చూశాడు. మొదటి చూపులో 'నువ్వుఇంతే' అన్నభావం ఉంది. రెండవ చూపులో 'నువ్వు ఇంతటివాడివా' అన్న ప్రశ్న ఉంది. రోడ్డుచేరి రిక్షా ఎక్కేలోపల భద్రం మొహంలోకి నాలుగైదు సార్లు తీక్షణంగా కూడా చూశాడు రాజారావు.

★ ★ ★

నెల తరవాత భద్రానికి అతని మేనమామ కూతురుతో పెళ్ళి అయింది.రాజారావు ఆ పెళ్లికి వెళ్ళి వచ్చాడుకూడా.

★ ★ ★

నాలుగైదు నెలలు గడిచాయి. ఈ కాలంలో భద్రం రాజారావు చాలా సార్లు షికారు వెళ్లారు.

ఓ ఆదివారం మధ్యాహ్నం భద్రం రాజారావు రూముకు వచ్చాడు. రాజారావు బ్రూకాఫీ కలిపాడు. ఇద్దరూ తాగుతున్నారు. " విశేషాలేమిటోయ్, భద్రం?"

" ప్రతేకించి ఏమీ లేవండి. నిన్న ఆఫీసుకు వెళ్లొచ్చేనంతే,"

" సరేకానీ, ప్రభాత్‌లో 'ఓరియంట్ బైనైట్' మాటినీ ఉంది. వెడదామేమిటోయ్?"

" మాటినీకా... ఎస్టాబ్లిష్‌మెంటు సెక్షను సూపరింటెండెంటుతో నాకు చిన్నపనుందండి. ఎలాగ? సరెపదండి. దోవే కదా, మూడు నిమిషాల్లో మాట్లాడి వచ్చేస్తాను."

" నువ్వొచ్చేదాకా వీధిలో నిలుచోనా బాగుంది!"... " అహఁమాఁ, అక్కర్లేదు.మీరు కూడా లోపలి కొద్దురుగాని . ఆయన చాలా మంచివాడండి. కల్చర్డ్‌పెర్సన్. మీ కెందుకూ, మీరు పదండి."

సింథాల్‌తో మొహం తోముకుని, వానిషింగ్ క్రీమ్ వగైరానల్నిటికీ పనిచెప్పి చొక్కాకు 'యూలీ' సెంటు పులుముకుని రాజారావు బయలుదేరేలోపల ఇన్ని పనులూ అమలుచేసి బయటికి ముందడుగు వేశాడు భద్రం ఇద్దరూ రిక్షా ఎక్కారు.

సూపరింటెండెంటు ఇల్లు వచ్చింది. రిక్షాను ఆపించాడు. భద్రం. ఇద్దరూ దిగారు. లోపలికి నడిచారు. ఎదుట హాల్లో ఉన్న కుర్చీల్లో కూర్చున్నారు."కామేశ్వరరావుగారూ, కామేశ్వరరావుగారూః" భద్రం పిలిచాడు.

"ఎవరిది?" పక్క గదిలోంచి ప్రశ్న.

"నేనండి, భద్రాన్ని.'

"ఆఁఆఁ గదిలోకి రావయ్యా, ఇక్కడ పార్టీతో మాట్లాడుతున్నాను."

భద్రంలేచి, " మీ రిక్కడే ఉండండి. రెండు నిమిషాల్లో వచ్చేస్తాను." అని గదిలోకి నడిచాడు.

ఒక నిమిషం గడిచింది. ఒక స్త్రీ తాలూకు కంఠం ఏడుపుతో కలిపి సన్నగా వినపడసాగింది రాజారావుకు. మధ్యలో మద్యలో మాటలు.

" నా కెవరూ పట్లు లేరండీ... ముగ్గురు చెల్లెళ్లనూ, తల్లి తండ్రుల్నీ పోషించుకోవాలండీ... గతంలో ట్రాన్సురు అయినప్పుడల్లా ఈ ఊరు, ఆ ఊరు అనే భేదం లేకుండా నేను వెళ్ళానండీ. ఇప్పుడిక నా వల్ల కాదండి. ఈ ట్రాన్స్ ఫర్ అఫెక్టు అయతే ఇప్పటికే దూరంగా ఉన్న దాన్ని వాళ్లకి ఇంకా దూరమవుతానండీ రాకపోకలు తగ్గటమే కాకుండా, జబ్బుగా ఉన్న మానాన్నను చూసే దిక్కు ఉండరండీ..." సన్నగా ఏడుపు

" నా మీద దయ ఉంచండి సార్... ఎట్లాగయినా ఈ ట్రాన్స్ ఫర్ ఆపించండి నేను మీకు

ఋణపడి ఉంటానండి. నా తండ్రి తరవాత తండ్రిలాంటివారు, సార్, మీరు. కనీసం అక్కడ మా చెల్లెలు చదువైపోయేవరకయినా ఓ రెండేళ్లు నన్నీ ఊళ్లో ఉండనియ్యండి సార్."

మళ్ళీ సన్నగా ఏడుపు. కామేశ్వరరావు కాబోలు మాట్లాడాడు

"! ఏడుపెందుకమ్మా? ఈ మాత్రం దానికి ఇంత ఆవేదన పడాలా! ఉద్యోగమన్న తరవాత ఎటువంటి వాడికయినా ఇటువంటి ఆటుపోటులు అనేవి ఉంటాయి మరి. అన్నట్లు, కిందటి వారం ఆఫీసుకు వచ్చి నాతో మాట్లాడింది నువ్వేకదూ?" .." అవునండీ."..." అరె, రెండు కాజువల్ లీవులు ఖర్చు చేశావా? సరే , ఇక ఈ విషయంలో నువ్వు కంగారుపడుకు. చేతనైనంత సహాయం చేస్తాను వెళ్ళు."

ఆ అమ్మాయి కొద్ది క్షణాలు ఏడుపును ఆపినట్టే ఆపి వెంటనే కొద్ది హెచ్చు స్వరంలో బావురుమంది. వెంటనే కామేశ్వరరావు గొంతు వినిపించింది.

" అరెరె! ఈ మాత్రానికే కాళ్లు పట్టుకుంటున్నావా? ఎంత పిచ్చిదానవమ్మా! నీ కొచ్చిన భయం ఏమీ లేదు. ఇదుగో , చూశావా, ఆయన ఛెయిర్మన్‌గారి కాంపు క్లర్కు. మేమిద్దరం చెయిర్మన్ గారితో మాట్లాడుతాము. నీ ట్రాన్స్ఫరు ఆపించటానికి శాయశక్తులా ప్రయత్నిస్తాము. ఆపైన నీ అదృష్టం నువ్విక ఈ ఊరు రానక్కరలేదు. ఎవర్నీ కలుసుకోనక్కరలేదు. వెళ్లిరా."

పక్క గదిలోంచి వినిపిస్తున్న ఈ మాటలన్నీ వింటూ కూర్చున్న రాజారావుకు ఎదురుగుండా ఉన్న ద్వారం లోంచి హాల్లోకి వస్తున్న వృద్ధుడొకాయన దర్శనమిచ్చాడు. బొ(ర, బొద్దు మీసాలతో చూడముచ్చటగా ఉన్న ఆవృద్ధుడు సూపరింటెండెంటు తండ్రి అవ్వచ్చు ననుకున్నాడు రాజారావు. ఆయన వచ్చాడు. వచ్చి టేబిల్ ముందరున్న కుర్చీలో కూర్చున్నాడు బుగ్గనిండా తమలపాకులున్నట్టున్నాయి. తాపీగా నములుతున్నాడు అందుకనే కాబోలు- 'మీరెవరు' అన్నట్టు చేత్తో సైగ చేవాడు."రాజారావు. కాలేజీలో పని చేస్తున్నాను."

'ఓహో!' అన్నట్టు తలూపాడు. వృద్ధుడు. కొన్ని క్షణాలాగి, సావకాశంగా తమ్మినంతా మింగి నోరు తెరిచి అడిగాడు " ఏఊరు?"... "ఏలూరు."... " అబ్బో, చాలా దూరమే!"... ఏలూరు చాలా దూరం ఎలా అయిందో రాజారావు కు అర్థం కాలేదు. వృద్ధుడు మళ్ళీ అడిగాడు.

" ఇక్కడికి ఎల్లా వచ్చారు?"

ప్రశ్న అవకతవకగా కనుపించింది. రాజారావుకు. బహుశా, 'ట్రాన్స్ఫరా, ఫ్రెష్ అప్పాయింట్ మెంటా? అని అడుగుతున్నాడు కాబోలు ననుకున్నాడు

" అబ్బే , ప్రమోషన్ వచ్చి వచ్చానండీ."... " ఏమిటీ, ఫ్రీ మోషన్‌లు అయి వచ్చారా? ఈ ఋతువులో ఫ్రీ మోషన్లేమిటండీ?.. ఓహో! కాబేజీ వ్యాపారం చేస్తున్నామని కదూ చెప్పారూ? బహుశా ఆహారంలోకి ఆ శాకమే ఎక్కువగా వాడుతూ ఉన్నట్టున్నారు. మరి ఫ్రీ మోషన్‌లు అవ్వవుటండీ! పైగా వేలూరి వాతావరణం ఎక్కడ, ఈ ఊరి వాతావరణం ఎక్కడ! సర్లెండి. నేనో రెండు పొట్లాలిస్తాను. ఇప్పుడొకటి, రాత్రిఒకటి తేనెతో కలిపి వేసుకోండి."

ముసలాయన కుర్చీ వెనక్కు జరిపి లేచి నుంచుని ఇంట్లోకి బయలుదేరాడు. రాజారావు నివ్వెరపోయి చూస్తున్నాడు. ఫ్రీ మోషన్లేమిటి, కాబేజీ ఏమిటి? కొంపదీసి ఈయనకు పిచ్చిగాని లేదుకదా! అనుకుంటున్నంతలో పక్కగదిలోంచి భద్రం వచ్చాడు.

" పదండి మాస్టారూ."

భద్రాన్ని ఏదో అడగాలనిపించింది రాజారావుకి అయితే ఇక్కడింక ఏ కొంచెం సేపు నించున్నా

ఆ ముసలాయన వచ్చి బలవంతాన తన నోరు తెరిపించి ఆ పొట్లం పొట్లం లోపలికి కుక్కేస్తాడేమోనన్న ఆలోచన తగలగానే గబగబా చెప్పుల్లో కాళ్లు దూర్చుకుని, పంచె ఎత్తి పట్టుకుని హడావుడిగా బయటకు నడిచేశాడు. మెట్లు దిగుతూండగా తాను కుర్చీలో సిగరెట్టు పెట్టె మరిచిపోయినట్టు జ్ఞాపకం వచ్చినా, వెనక్కి నడిచే సాహసం లేక భద్రాన్ని చేయి పట్టి గుంజుతూ రెండే రెండు అంగల్లో రిక్షాను చేరాడు

రిక్షాలో ఎక్కి కూర్చున్నాక భద్రం అడిగాడు, " ఏమిటి, మాస్టారూ, అంత కంగారు పడు తున్నారు?" జరిగిందంతా చెప్పాడు రాజారావు. అంతా విని పకపకా నవ్వాడు భద్రం. "ఆయనకు బ్రహ్మచెవుడు, సార్...ఆయన కామేశ్వరరావు ఫాదర్. వయసులో ఉన్నప్పుడు ఆయుర్వేద వైద్యం చేసేవాడు. వృద్ధాప్యం వచ్చినా దానిమీద అభిమానం చంపుకోలేక అడిగిన వాళ్లకి ఒకటీ అరా పొట్లాలూ, గుళికలు ఇస్తూంటారు. తన కింకా ఊళ్ళో ఎంత పేరుందో తెలుసుకోవటం కోసం ఇక్కడికి మీరు ఎవరి ద్వారా వచ్చారు? అని వచ్చిన ప్రతి కొత్త వాణ్ణి అడుగుతూంటాడు. తెలియని వాళు మీ లాగే తికమక పడిపోతూంటారు." అని మళ్ళీ నవ్వాడు.

రాజారావు మొహంలో చిరాకు కొట్టవచ్చింది. " రాకరాక భలే కొంపకు వచ్చామే" అన్నాడు.

కొన్ని నిమిషాలు గడిచాయి. రిక్షా వంతెన దాటింది. రాజారావు అడిగాడు , " సరేగాని, ఇందాక లోపల ఎవరో ఆడమనిషితో మాట్లాడుతున్నట్లున్నావు... పంతులమ్మ వ్యవహారమేమిటి?" ఇట్లా అని అలవోకగా నవ్వాడు. " అవునండీ, ఆ అమ్మాయిది ఒక విషాదగాథ. మీరు అంతా వినే ఉంటారు. ఎస్టాబ్లిష్‌మెంటులో రమణమూర్తికి పదిరూపాయలిచ్చిందట ఈ ట్రాన్స ఫరు కాన్సిల్ చేయించమని. వాడది పుచ్చుకుని ఊరుకుండి పోయాట్ట. గోల పెడుతూ నా దగ్గరికి వచ్చింది. నేను చేసే సహాయం చేస్తాను. సూపరింటెండెంటు గారినికూడా కలుసుకోండి' అని చెప్పాను. అందుమీదట కాబోలు ఇక్కడికి వచ్చింది. ఈ ట్రాన్స్ఫర్ ఆపించమని ఎలా కాళ్ళావేళ్ళాపడుతున్నదో చూశారా? అబ్బ, ఆ అమ్మాయి పడే ఆవేదన చూడలేకపోతున్నా మనుకోండి."

" నీ దాకా దేనికి, తిన్నగా ఛైర్మన్‌నే కలుసుకోవచ్చుగదా!"... " అలా కలుసుకునేదే అయితే, రెండేళ్ళలో నాలుగు సార్లెందుకు మూలలకు విసిరేయబడుతుంది?"

"ఏమటి, అమ్మాయి అంత తిన్ననైన మనిషా?"

" మరి? ఆ అమ్మాయి పని చేసిన ప్రతి ఊరిలోనూ ప్రతి స్టూడెంటూ, ప్రతి పేరెంటూకూడా ఆ అమ్మాయి చదువు చెప్పే విధానాన్నీ, అణకువ తనాన్నీ మెచ్చుకున్నవాడే. ఆ అమ్మాయి ఎంత ఉన్నతమైన మనసో ఎప్పుడూ కాంపుల్లో తిగిడేవాడిని కనుక నాకు తెలిసినట్లుగా ఇంకెవరికీ తెలియదు, మాస్టారూ... ఇంతేయినా ఎంత సింపుల్‌గా ఉంటుందనుకున్నారూ! పెళ్ళి కాలేదనుకోండి."

" నువ్వెన్ని చెప్పబ్బాయ్, పంతులమ్మల్లో అలాంటి వాళ్లు ఉన్నారంటే నేనంత తేలిగ్గా నమ్మను. ఇంతకీ నాకా అమ్మాయిని చూపించవలసింది. పొరపాటు చేశావు."

" అరె, మీరు చూడలేదా? అవున్లెండి చూసే వీలు లేదు. ఆ అమ్మాయి పక్క సందులోంచి బయటకు వెళ్ళిపోయింది."

" ఇంతకీ, ఆ అమ్మాయి పేరు?" ... " రాజేశ్వరి.". రాజారావు ఎటో చూస్తూ కూర్చుండిపోయాడు.

సినిమా హాలు వచ్చిందని రిక్షావాడు హెచ్చరించే వరకూ ఇద్దరూ ఈ లోకంలో లేరు.

★ ★ ★

ఓ వారం గడిచింది. భద్రం, రాజారావు సీక్వెన్సు ఆడుతున్నారు. రాజారావు హఠాత్తుగా అడిగాడు, " ఇంతకీ ఆ పంతులమ్మ విషయం ఏం తేలిందోయ్?"

" తెలిసేముందండీ, ఆ అమ్మాయి నాకు చెప్పుకున్న విషయాన్నే కొంచెం పాతోస్ రంగరించి అయ్యగారు మూడ్‌లో ఉన్నప్పుడు చెప్పాను. కామేశ్వరరావుగారు కూడా సాధ్యమైనంత ఎఫ్ఫెలింగుగానే చెప్పారట. ఫలితంగా , ప్రస్తుతానికి ట్రాన్స్ఫరు అవుతున్నట్టు నోట్ పెట్టమన్నారు అయ్యగారు.. అన్నట్టు, నిన్నటి క్యాంప్‌లో ఇంకో విషయం తెలిసిందండోయ్!"

"ఏమిటి?"

"ఆ అమ్మాయికి నాలుగేళ్ళకొడుకొకడున్నాట్ట!"

"ఏమిటీ, చెప్పావుకావు!" రాజారావు తలెత్తి భద్రం వైపు చూశాడు. పరిచి పట్టుకున్న ముక్కల్ని చేతిలోనే ముడిచేశాడు

" ఎలా తెలిసింది, నీకీ విషయం?" అన్నాడు.

"ఏముందీ, ఆ అమ్మాయి అద్దెకుంటున్న ఇంటాయన తన కొడుక్కి ఉద్యోగం వేయించుకోవటం కోసం సమితి ప్రెసిడెంటును వెంటబెట్టుకుని అయ్యగారి దగ్గరి కొచ్చాడు. లోపల అయ్యగారితో సమితి ప్రెసిడెటు మాట్లాడుతూండగా నేను ఆయనతో కబుర్లు కలిపాను. మాటల్లో ఆయన రాజేశ్వరీ తనింట్లోనే ఉంటున్నదనగానే నాకూ కుతూహలం ఎక్కువై వివరాలు రాబట్టాను. ఆ వివరాల్లో ముఖ్యమైనది ఆ అమ్మాయి కో కొడుకు ఉండటమనేది."

ఇద్దరి మధ్యా కొన్నినిముషాలు నిశ్శబ్ద తాండవం చేసింది. ఉక్కపోస్తూండటం మూలాన భద్రం వెళ్లిఫాన్ ఆన్ చేసి వచ్చాడు.

రాజారావు అన్నాడు, " ఇంతకీ ఆ అమ్మాయిది ఏ ఊరుట?"... " నేటివ్ ప్లేస్ విశాఖపట్నం. వర్క్ చేస్తున్నది... " ... " ఆగాగు, విశాఖపట్నమా, పేరు రాజేశ్వరికదూ, పెళ్ళి కాకుండానే నాలుగేళ్ళ కొడుకా?"

రాజారావు పేకముక్కలు కింద పడేశాడు. లుంగీ ఎత్తి పట్టుకుని గదిలో పచార్లు చెయ్యటం మొదలుపెట్టాడు. " ఆ అమ్మాయి మీకు తెలుసా, మాస్టారూ?" రాజారావు మాట్లాడలేదు. భద్రం ముక్కలన్నీ పోగుచేసి బొత్తిని కార్టన్‌లో పెడుతూ అన్నాడు, " ఎవడో దరిద్రుడు ఆ అమ్మాయిని ఆశపెట్టి పాడుచేసి ఉంటాడు. ఇలా ఆడవాళ్లకు అన్యాయం చేసేవాళ్లను చూస్తే నిలువునా చీరేయాలనిపిస్తూందండీనాకు. పాపం, ఆ అమ్మాయి ఎంత సవ్యమైన మనిషండీ!"

రాజారావు ఆగాడు " బహుశా పరిస్థితులు అనుకూలించక వాడు పెళ్ళి చేసుకో లేదేమో" అన్నాడు. రెండు నిముషాలు పచార్లు చేసి భద్రం ఎదురుగుండా వచ్చి నించుని అతని మొహంలో మొహం పెట్టి - " నువ్వే అతడి స్థానంలో ఉంటే ఏం చేసేవాడివి?" అన్నాడు.

" నేనే అయితే అసలు ఇటువంటి గ్రంథం నడిపేవాడినే కాదు. ఒకవేళ నడిపినా ఆ అమ్మాయి చూలాలు అయిందనే సరికి పిరికివాడినై పారిపోయి వచ్చే వాడినేకాదు. లక్షణంగా పెళ్ళి చేసుకునే వాడిని"

రాజారావు భద్రం వైపు తీక్షణంగా చూశాడు మళ్ళీ మళ్ళీ చూశాడు. ఇంకో అయిదారు సార్లు పచార్లు చేశాడు. రెండు నిమిషాలయ్యాక అన్నాడు, " సరే, బాగానే ఉంది. ఒకవేళ ఆ వివాహానికి మీ అమ్మా, నాన్నా ఒప్పుకోకపోతే?" " అదేమిటి, సార్! నీచుణ్ణయి ఒక పెళ్ళికాని పిల్లను పాడు చెయ్యటమూను, అమ్మా, నాన్నలను చూపించి తప్పించుకోవటమూనా! నిజానికిప్పుడు నేను కట్నం లేని పెళ్ళి చేసుకున్నానని మానాన్న నాతో మాట్లాడడం మానేశాడు. తెలాసా?"

రాజారావు ఆగి తల ఎత్తి భద్రం వైపు చురుక్కున చూవాడు. మాట్లాడలేదు పచార్లు చెయ్యటం

ఆపలేదు భద్రం నించుని. "నే నెడుతున్నానండీ" అన్న మాటలు అతనికి వినబడలేదు.

* * *

మరునాడు మళ్లీ రాజారావును కలుసుకోవాలని వచ్చిన భద్రాన్ని గదికి వేసి ఉన్న తాళం వెక్కిరించింది.

ఓపది రోజులు పోయాక భద్రానికి ఫ్రమ్ అడ్రెస్ వ్రాసి ఉన్న కవరొకటి వచ్చింది.

"డియర్ భద్రం,

నాకన్నా వయస్సులో చిన్నవాడి వయినా మనస్సులో పెద్దవాడివి. అనేక సందర్భాల్లో నువ్వు వెలిబుచ్చిన అభిప్రాయాలు నాకు తెలియనివి కావు, కానీ, తాను చెప్పేవాటిని ఆచరించీ చూపించే వాడిని నిన్నొక్కడినే చూశాను. అందుకనే ప్రభావితుడనయ్యాను.

నేటినుండి నా జీవితనౌక తన దిక్కుమార్చుకోబోతూంది. కారణమేమిటంటే, నేను రాజేశ్వరిని రిజిస్టర్డ్ మారేజి చేసుకోబోతున్నాను. ఆమెకు పుట్టిన వాడు నాకొడుకే- విశాఖపట్నంలో ఎమ్.ఏ. చదువుతున్నప్పుడు ఆమెతో నేను చేసిన స్నేహఫలితమే. ఆడవాళ్ల పట్ల , అందునా పంతులమ్మల పట్ల నాకున్న భావాలను నువ్వు వమ్ము చేశావు. ఈ ప్రయత్నంలో ఉదాహరణగా నా రాజేశ్వరినే నాకు చూపించావు. ఇందుకు నేను నీ కెంతగానో ఋణపడి ఉన్నాను. నీ జీవితం స్టవ్ వంటిది. చేతనైనంత వెలుగును చీకట్లో ఉన్న నా జీవితానికిచ్చింది. పెర్ఫెక్షనుకు ఇంకా దగ్గరగా నువ్వు జీవించటం ద్వారా నీ జీవితం ఒక జ్యోతి అయి పదుగురికీ మార్గదర్శకమవుతుందనీ ఆశిస్తున్నాను. పెళ్ళికి నిన్నొక్కడ్నే ఆహ్వానిస్తున్నాను. కాంపింగ్ ఉన్నా మానుకుని వస్తావు కదూ?

నీ ఆత్మ బంధువు,

-రాజారావు."

(ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక 25-7-73)

* * *　* * *　* * *

# హామీ

" ఒకలైలా కోసం, టుఁయ్,టుఁయ్,టుఁయ్, తిరిగాను లోకం , టుఁయ్,టుఁయ్,టుఁయ్, ప్రతి పగలూ, ప్రతి రాత్రి గుర్‌ర్‌ర్‌ర్‌ర్... - హాలో హలో మైక్ టెస్టింగ్... అయ్యా, అమ్మా, సమస్యల్తో వేగిపోయే మీ కందరికీ శుభవార్త! ప్రజల అనారోగ్యాన్ని .. ఒక లైలా కోసం. బాగు చెయ్యాలనే ఉద్దేశంతో.. ఒక లైలా కోసం... మేము కనిపెట్టిన అద్భుతమైన చర్మరోగ నివారిణి చర్మ రంజనిని చాలా తక్కు ధరలో అమ్ముతున్నాం.. ఒక లైలాకోసం... పప్పు తామర, కొప్పు తామర, ఉప్పు తామర, నిప్పు తామర వగైరా ఏడు రకాల ముప్పు తామరలనూ, అయిదు రకాల గజ్జిలనూ, .. ఒక లైలా కోసం .. నివారించి, నిర్మూలించి, నిశ్శేషించి, నాశనం చేసేస్తుందండీ మా యీ చర్మ రంజని. పాకెట్టు రూపాయి మాత్రమే. నమ్మండి బాబూ.. ఒక లైలాకోసం . సంవత్సరం వస్తుంది, పెద్ద పాకెట్టు కొనండి బాబూ, రెండ్రూపాయలు, మూడేళ్ళొస్తుంది.. తప్పుకోరా కొడకా, నా బండికి నీబండి అడ్డుపెడతావేంట్రా!.. నన్ను పోనీ... హలో, ఇంకో సెంటర్‌కి బండి వెళ్ళిపోతోందండి, కావాల్సినవాళ్లు బండి దగ్గరకొచ్చి కావల్సినవన్నీ పాకెట్టు